క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకట్రామరాజు



రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా న్యాయవాది అద్దిపల్లి వెంకట్రామరాజు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షునితో పాటు కార్యదర్శిగా శివశంకర్‌రెడ్డి, కోశాధికారిగా ఇందిరాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

పెనగలూరు : మండలంలోని పెనగలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న పదోతరగతి పరీక్షలను ఎంపీడీఓ విజయారావు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు జరగడం విద్యార్థులకు మంచి పరిణామమన్నారు.

పాఠశాలకు కూలింగ్ యంత్రం వితరణ



కూలింగ్ యంత్రాన్ని అందజేస్తున్న ఖలీల్ బాషా

పెనగలూరు : మండలంలోని కస్తూర్బా పాఠశాలకు కొత్తపల్లి గ్రామానికి చెందిన ఖలీల్ మంగళవారం కూలింగ్ యంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ చదువుకునే పేద పిల్లలు చల్లని నీరు తాగాలనే ఉద్దేశంతో కూలింగ్ యంత్రాన్ని వితరణగా అందజేసినట్లు వారు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, హైస్కూల్, మసీదులకు కూలింగ్ యంత్రాలను అందజేసినట్లు వారు తెలియజేశారు. అనంతరం ఖలీల్‌ను కస్తూర్బా గాంధీ ప్రిన్సిపల్ సుచరిత శాలువాతో సన్మానించారు.

చలివేంద్రం ఏర్పాటు



ప్రారంభిస్తున్న తహసీల్దారు మాధవీలత

సిద్దవటం : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రం కేంద్రాన్ని మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని కార్యాలయ సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకే దీనిని ఏర్పాటు చేశామన్నారు. నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండండి



రామకృష్ణ, ఎస్ఐ

గాలివీడు : వేసవి దృష్ట్యా పిల్లలు ఈత కొట్టడానికి బావులు, చెరువుల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటి పూట బడులు, పదవ తరగతి పరీక్షలు ముగిసిన క్రమంలో పిల్లలు ఎక్కువగా వేసవిలో చేపలు పట్టేందుకు, సేదతీరడానికి స్విమ్మింగ్ పూల్, చెరువులు, బావుల వద్దకు వెళుతుంటారు. అవి ఎంత లోతు వున్నాయో తెలియక, అందులో రాళ్లు, బురద, తీగలు ఉండటంతో వాటిలో చిక్కుకుని ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. అందువల్ల పెద్దలు, ఈత వచ్చిన వారి పర్యవేక్షణలో చిన్నారులను గమనిస్తూ ఉండాలని సూచించారు.

సర్పంచ్ రక్తదానం



సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లె గ్రామ వైఎస్‌ఆర్‌సీపీ సర్పంచ్ రామా జయచంద్ర అత్యవసర సమయంలో రామాపురం మండలం నాయునివారిపల్లెకు చెందిన వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్త చిట్రాజు మదన్ మోహన్ కుమారుడు ఆరోగ్య పరిస్థితి సరిలేక రక్తం కావాలని కోరగా వెంటనే స్పందించి ఆయన దీపా బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. అడిగిన వెంటనే స్పందించి రక్తదానం చేసిన సర్పంచ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

శిల్పారామంలో సందడి

కడప కల్చరల్ : రంజాన్ పండగ సందర్భంగా మంగళవారం కడప శిల్పారామం సందర్శకుల తాకిడి కనిపించింది. సాయంత్రం కళావేదికపై పులివెందులకు చెందిన ఎస్కే డ్యాన్స్ అకాడమీ, కడపకు చెందిన అఖిల్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు నృత్యాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు.

ఓ పనైపోయింది..

- ముగిసిన టెన్త్ పరీక్షలు
- బరువెక్కిన విద్యార్థుల హృదయాలు
- సెలవులను సద్వినియోగం చేసుకుంటామంటున్న విద్యార్థులు



రాజంపేట టౌన్: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

రాజంపేట టౌన్ : విద్యార్థుల జీవితానికి పదవ తరగతి మలుపులాంటిది. అందువల్ల విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని గత తొమ్మిది నెలలుగా చదువే లోకంగా చదివారు. ఇదిలావుంటే గత నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన టెన్త్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. దీంతో అనేక మంది విద్యార్థులు పరీక్షా కేంద్రం నుంచి బయటకు ఉత్సాహంగా వచ్చి తోటి మిత్రులను పరీక్ష ఎలా రాశావంటూ తెలుసుకున్నారు. అలాగే పరీక్షా కేంద్రం నుంచి గేటు బయట వరకు కలిసి వచ్చిన విద్యార్థులు ఇళ్లకు బయలు దేరే సమయంలో బరువెక్కిన హృదయాలతో కనిపించారు. అదే సందర్భంలో మనమంతా పాస్ అయ్యి ఒకే కాలేజీలో చేరుదాం అని పలువురు మిత్రులు తమ స్నేహాన్ని మునుముందు సాగించాలన్న ఆకాంక్షను వెలిబుచ్చారు. ఒకవైపు పరీక్షలు ముగిశాయి అన్న ఆనందం, మరోవైపు నిత్యం పాఠశాలల్లో కలుసుకునే స్నేహితులను విడిచి వెళుతున్నామన్న బాధ విద్యార్థుల మోముల్లో స్పష్టంగా కనిపించింది. ఏప్రిల్ 7వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమై తరగతులు ప్రారంభం కానున్నాయి. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలను వివిధ కళాశాల్లో చేర్పించేందుకు ఇప్పటి నుంచే అడ్మిషన్ తీసుకునే పనిలో ఉన్నారు. ఇదిలావుంటే తమ పిల్లల కోసం బయట వేచివున్న తల్లిదండ్రులు తమ పిల్లలు బయటకు రాగానే ఎంతో ఆతృతగా పేపర్ ఎలా వచ్చింది, పరీక్ష బాగా రాశావా అని అడిగారు. ఈ సందర్భంగా కొంతమంది తల్లిదండ్రులు అన్ని సబ్జెక్టులు కలిపి వచ్చే మార్కులను కూడా లెక్క వేసుకున్నారు. ఇదిలావుంటే కొంత మంది విద్యార్థులను 'సాక్షి' పలుకరించగా సెలవులను వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకుంటామని చెప్పారు.

ఇంటర్మీడియట్ సిలబస్ చదువుతాను



ఈ ఏడాది ఏప్రిల్ 7వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ తరగతులు ప్రారంభం అవుతున్నాయి. నేను విజయవాడలో ఓ కాలేజీలో ఇప్పటికే ఫస్ట్ ఇయర్ అడ్మిషన్ తీసుకున్నా. ఏప్రిల్ 24వ తేదీ నుంచి సమ్మర్ హాలిడేస్ ఉంటాయి. హాలిడేస్‌లో ఇంటర్మీడియట్ సిలబస్ చదువుకుంటాను. ఇంటర్మీడియడ్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించడమే నాముందున్న లక్ష్యం.

– హారిక, రాజంపేట

కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటా



ఏప్రిల్ 7వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ అడ్మిషన్స్ ప్రారంభం అవుతున్నాయి. అందువల్ల ఇంటర్మీడియట్‌లో చేరి 24వ తేదీ వరకు కళాశాలకు వెళతాను. ఆ తరువాత నెలరోజులకు పైగా ఉండే సెలవుల్లో కంప్యూటర్ కోర్సు చేస్తాను. అలాగే సాయంత్రం వేళల్లో క్రీడలను సాధన చేస్తా. సెలవులను మాత్రం వృథా చేయను. సద్వినియోగం చేసుకుంటాను.

– రాజేష్, రాజంపేట

ఆలోచించి గ్రూపు ఎంపిక చేసుకోండి



ఇంటర్‌లో అడ్మిషన్ తీసుకోవడానికి సమయం తక్కువ ఉంది. అందువల్ల విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావంతుల సలహాలు తీసుకొని గ్రూపును ఎంపిక చేసుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల మేధస్సును బట్టి గ్రూపు ఎంపికను సూచించాలి. గ్రూపు ఎంపికలో తల్లిదండ్రులు తమ పిల్లల ఆసక్తిని కూడా పరిగణలోకి తీసుకోవాలి.

– కొండూరు రఘునాథ్‌రాజు, ఎంఈఓ, రాజంపేట

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా నేడు బుధవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఒంటిమిట్ట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రమణ్యం తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా ఒంటిమిట్ట టౌన్, మాధవరం, మంటంపల్లి, సిద్దవటం, బాకరాపేట, జ్యోతి తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నిమ్మనపల్లె : కారు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. సాయికృష్ణ అనే వ్యక్తి చౌడేపల్లె నుంచి మారుతీకారులో వాయల్పాడుకు వస్తున్నాడు. నిమ్మనపల్లె పెద్దమాదిగపల్లెకు చెందిన గణేష్ టూవీలర్‌లో మదనపల్లెకు వెళుతుండగా పిట్టావాండ్లపల్లె వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొంది. ప్రమాదంలో గణేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



లక్కిరెడ్డిపల్లి: పరీక్షపై చర్చిస్తున్న విద్యార్థులు



గాలివీడు: పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు



సుండుపల్లె: పరీక్ష రాసి వస్తున్న పది విద్యార్థులు

గాలివీడు/లక్కిరెడ్డిపల్లి/సుండుపల్లె : మండలంలో మార్చి 17వ తేదీన ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు మంగళవారం సోషియల్ పరీక్షతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి పరీక్ష మార్చి 31వ తేదీన పూర్తి జరగాల్సి ఉండగా రంజాన్ పండుగ సందర్భంగా ఏప్రిల్ 1న నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించారు. కొన్ని అనివార్య కారణాలు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం కారణంగా కొంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేకపోయారు. మొత్తానికి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగియడంతో అటు విద్యార్థులు ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు

నందలూరు : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి, డిప్యూటీ విద్యాశాఖాధికారి శివ ప్రకాష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా సరళిని పరీక్షా కేంద్రం చీఫ్ షేక్ రౌఫ్ బాషాని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ చివరి పరీక్షకు మండల వ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రాలలో 670 మంది విద్యార్థులకు గాను 667 మంది విద్యార్థులు హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్ అధికారి దండు సుబ్బారెడ్డి, నాన్ టీచింగ్ సిబ్బంది ముస్తకీ బాషా, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సూచనలు పాటిస్తే దిగుబడులు

సిద్దవటం : ఉద్యాన పంటల్లో ముఖ్య భాగమైన పండ్ల తోటలైన మామిడి, చీనీ, నిమ్మ, అరటి, పుచ్చ, దోస పంటలలో ఉద్యాన శాఖ అధికారుల సాంకేతిక సూచనలను రైతులు పాటిస్తే మంచి దిగుబడిని పొందవచ్చునని బద్వేల్ ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని భాకరాపేటలో మామిడి తోటలు సాగు చేసిన రైతులకు మంగళవారం పంటలపై తగు సూచనలు ఉద్యాన శాఖ అధికారి తెలియజేశారు. ఈ సందర్భంగా జయభరత్‌రెడ్డి మాట్లాడుతూ పండ్ల తోటల రైతులు అధికారుల సాంకేతిక సూచనలు పాటిస్తే అధిక ఉష్ణోగ్రత, గాలులు, చెదురుమొదురు వర్షాలు వంటి ప్రతికూల వాతావరణ మార్పులు ఏర్పడినప్పుడు మంచి దిగుబడిని పొందుతూ పంటను సమర్థవంతంగా కాపాడుకోవచ్చునన్నారు. ఈ ఏడాది మామిడిలో పూత అలస్యంగా రావడంతో పిందె కట్టడం అనుకున్న స్థాయిలో లేనప్పటికీ, ఏర్పడిన పిందెను కాపాడుకోవడానికి ప్లానోఫిక్స్ 2 మిల్లీ లీటర్లు మందుకు 10 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ సంవత్సరం తేనే మంచు పురుగు ఉధృతి తక్కువగా ఉన్నప్పటికీ బ్యాక్టీరియా బంక తెగులు నివారణకు బ్లీతోస్ 3 గ్రాములు, ప్లాంటామైసిన్ 2 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, అధిక గాలుల వలన కాయ దెబ్బ తినకుండా ఫ్రూట్ కవర్లతో సంరక్షించుకుంటే కాయ నాణ్యతగా ఉండి మంచి ధర పలికే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత సీజన్‌లో చీనీ, నిమ్మలో కాయ బఠాణి నుంచి మార్బుల్ సైజు ఉన్నప్పుడు తామర పురుగు లేదా నల్లి ఆశించినప్పుడు ఫైప్రోనిల్2 మిల్లీ లీటర్లు, డైకోఫాల్ 1 మిల్లీ లీటరు మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే కాయ నాణ్యత పెరగడానికి 13:0:45 మందును 10 గ్రాములు, ఫార్ములా–4, 3 గ్రాములు లీటరు నీటికి కలిపి వాడుకోవాలన్నారు. నీటి తడులు, ఎరువులు సమపాలల్లో అందిస్తూ సేంద్రియ ఎరువులు, ట్రైకోడెర్మా, సూడోమోనాస్, వాడటం వలన వేరుకుళ్ల తెగులును అరికట్టవచ్చునని ఆయన అన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

చేష్టలు ఆకతాయిలవి.. తిప్పలు ప్రజలవి!



వృథాగా పోతున్న నీరు

వీరబల్లి : రోళ్లమడుగు నుంచి వీరబల్లి మండలానికి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో వీరబల్లి మండల ప్రజల దాహార్తి తీర్చడానికి ఎంత కష్టమైనా వెనుకాడకుండా పనులు చేయించారు. అటువంటి నాయకుడు కష్టం, కృషిని ప్రస్తుత అధికారులు నీరు గారుస్తున్నారు. రోళ్లమడుగు పైపులకు సానిపాయి జింక హరిజనవాడ లేఅవుట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు డ్యామేజీ చేయడంతో నీరు వృథాగా పోతోందని సానిపాయి ప్రజలు తెలుపుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ప్రజలు మంచినీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి సమయంలో పైపులను డ్యామేజీ చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలానే పైప్‌లను ధ్వంసం చేస్తున్న ఆకతాయిల ఆటలు అరికట్టి, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గేమింగ్ విడిచి గోలీల వైపు



ఉల్లాసంగా గోలీల ఆట ఆడుకుంటున్న పిల్లలు



ఇసుకలో గుజ్జనగూళ్లు కడుతున్న చిన్నారులు

సంబేపల్లె : 5జీ సాంకేతిక పరిజ్ఞానంతో సాంప్రదాయ ఆటలకు ఎప్పుడో కాలం చెల్లింది. స్మార్ట్ ఫోన్‌లలో ఆన్‌లైన్ గేమ్‌లు, వీడియో గేమ్‌లు తదితర అంతర్జాల సేవలు వినియోగించుకొంటూ భౌతికంగా ఆడే ఆటలను పిల్లలు ఎప్పుడో మరిచిపోయారు. ఈ నేపథ్యంలో అడపదడపా గ్రామీణ ప్రాంతాలల్లోని పిల్లలు గ్రామీణ ఆటలను ఆడుతూ గుర్తుకు చేస్తున్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లెలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పిల్లలందరూ ఒకచోట చేరి గోలీల ఆట, ఇసుకలో గుజ్జన గూళ్లు కడుతూ, కుచుకుచుపుల్లా, నాలుగురాళ్లు తదితర ఆటలతో పిల్లలు ఆడుతుండటం ×సాక్షి¥గమనించింది. పిల్లలు ఆడుతున్న ఈ ఆటలకు తిరిగి పూర్వ వైభవం తెచ్చేలా పిల్లల్లో అవగాహన కల్పించాలని గ్రామస్తులు చర్చించుకొంటున్నారు.

కార్మికుల పట్ల నిరంకుశ వైఖరి తగదు

- పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాల్సిందే
- ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్



రాయచోటి అర్బన్: కమిషనర్ వాసుబాబుకు వినతి పత్రం అందజేస్తున్న వర్కర్స్ యూనియన్ నేతలు



రాజంపేట: కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాయచోటి అర్బన్ : ఆప్కాస్ ద్వారా నియమితులైన పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే పదవీ విరమణ వయస్సు, గ్రాట్యుటీ వర్తించవంటూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ జారీచేసిన కార్మిక వ్యతిరేక సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వి.రమణ, రాయచోటి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు మున్సిపల్ కమిషనర్ వాసుబాబును ఆయన చాంబర్‌లో కలుసుకున్నారు. మాట్లాడుతూ ఆప్కాస్ అనే సంస్థ ప్రభుత్వ అధికారుల ఆధీనంలో నడుస్తున్న సంస్థ అన్నారు. అయితే పాలకులు ఆప్కాస్‌ను ఔట్ సోర్సింగ్ ఏజన్సీల కోసం ఏర్పాటు చేసినట్లు సాకులు చూపుతూ చట్టబద్ధంగా అమలుకావలసిన గ్రాట్యుటీ పథకం అమలును నిరాకరించడం ప్రభుత్వ నిరంకుశ చర్యలకు నిదర్శనమన్నారు. ఇంతకాలం మిన్నకుండి ఇప్పుడు ఆప్కాస్ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగుల కాదంటూ చెబుతున్న ప్రభుత్వం గత నాలుగేళ్లుగా 60 సంవత్సరాల వయస్సు నిండిన వారిని ఉద్యోగులు అనే కారణంతో బలవంతంగా పదవీవిరమణ ఎలా చేయించారంటూ వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం నిరంకుశ వైఖరితో జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. 17 రోజుల సమ్మె విరమణ సందర్భంగా జరిగిన ఒప్పందం మేరకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తో కూడిన పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచి, గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామంటూ వారు హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట పురపాలక సంఘం కార్యాలయ క్యాంపస్‌లో మున్సిపాలిటీ కార్మికులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో ఈ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం రద్దు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన ప్రదర్శన చేశారు. గత 22 సంవత్సరాలుగా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు శాశ్వత ప్రాతిపదికన నియమిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన విషయాన్ని కూటమి ప్రభుత్వం మరిచిపోయినట్లుందన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, కోశాధికారి లక్ష్మీదేవి, నాయకులు ఓబయ్య, ప్రసాద్, రమణ, ప్రమీల, బాలాజీ, శీను, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఓబులవారిపల్లె : ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష కోసం ఉచితంగా శిక్షణను ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ దేవరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ భవనంలో నేడు బుధవారం నుంచి ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఉచితంగా శిక్షణను ఇవ్వనున్నట్లు చెప్పారు. పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిసెట్ ప్రవేశాలకు ఉపయోగకరంగా ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. పూర్తి వివరాల కోసం 90102 22154ను సంప్రదించాలన్నారు.

కోటలో బాసికుద్బా సందడి



సిద్దవటం కోటలో సేదతీరుతున్న పర్యాటకులు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని మట్లి రాజుల కోటలో పర్యాటకులు మంగళవారం బాసికుద్బా వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు సోమవారం రంజాన్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు. వైఎస్సార్‌జిల్లా, అన్నమయ్య జిల్లాల నలుమూలల నుంచి ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి సిద్దవటంలోని మట్లి రాజుల కోటలో బాసికుద్బా వేడుకలను నిర్వహించారు. అనంతరం వెంట తెచ్చుకున్న భోజనాన్ని ఆరగించి పెన్నానదిలో కోటలోని సొరంగ మార్గం గుండా వెళ్లి నీటిలో ఈతలాడుతూ కేరింతలు కొట్టి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

ఏఎస్ఐకి సన్మానం



ఏఎస్ఐ చంద్రయ్య దంపతులను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, అధికారులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా మదనపల్లె–2 పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ మంగళవారం పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ పి.చంద్రయ్యను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ రావు సన్మానించారు. చంద్రయ్య పోలీస్ శాఖలో ఎంతో సేవ చేశాని చెప్పారు. తన 38 సంవత్సరాల కాలంలో చాలా క్రమశిక్షణతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారని కొనియాడారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ప్రశాంతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, ఏఓ బి.కృష్ణుడు, ఆర్ఐలు విజె రామకృష్ణ, ఎం.పెద్దయ్య, మదనపల్లె ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల్లో నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామంలోని రైతు దుంపల అశోక్ రెడ్డి తన పట్టాభూమిని ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా మంగళవారం కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ సదరు భూమిని పరిశీలించారు. టక్కోలులోని సర్వేనెంబర్ 429/1, 429/2, 430లలోని అశోక్‌రెడ్డి పట్టాభూమి 4ఎకరాల 85 సెంట్లలో అగ్రికల్చర్ గోడౌన్ నిర్మాణానికి ల్యాండ్ కన్వర్షన్ కోరుతూ దరఖాస్తు చేసుకోగా కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ రైతు భూమిని, హద్దులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత మాట్లాడుతూ రైతులకు సంబంధించి పట్టా భూముల్లో ఏదైనా కట్టాడాలను నిర్మించాలన్నా ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తులు చేసుకొని అధికారుల అనుమతులను పొందాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్ నాగభూషణం రెడ్డి, విలేజ్ సర్వేయర్ పవన్‌కుమార్, వీఆర్‌ఓ సంటియ్య, వీఆర్‌ఏ కిషోర్ రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలుపుతున్న మహిళలు, సీపీఐ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దప్పేపల్లి గ్రామ పరిధిలో కొండవాండ్లపల్లి విజయనగరంలో దాదాపు నెల రోజులుగా తీవ్రమైన తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజలతో కలిసి మంగళవారం సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాలకు సంబంధించి 24 వేల ఎకరాలకు సాగునీరు మూడు మండలాల్లోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటైన ప్రాజెక్టు కనీసం సాగునీటికి దేవుడెరుగు చుక్క తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 2018లో సీపీఐ ఆధ్వర్యంలో వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని గాలివీడు నుంచి కడప జిల్లా కలెక్టరేట్‌కు పాదయాత్ర నిర్వహించామని గుర్తు చేశారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. కూటమి ప్రభుత్వమైనా వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి, రఫీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి



రామచంద్రయ్యకు నివాళులర్పిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

నందలూరు : మండలంలోని నల్లతిమ్మయ్యపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ పసతల రాజమ్మ తండ్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పసతల రామచంద్రయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్ రెడ్డి రామచంద్రయ్య మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గడికోట సుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి, గీతాల నరసింహారెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, పెనుబాల నాగసుబ్బయ్య, అరిగెల నాని, నరసారెడ్డి, ఆనాల మధు యాదవ్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన

రాయచోటి అర్బన్ : ఫ్యాప్టో రాష్ట్రకమిటీ పిలుపుమేరకు బుధవారం(నేడు) అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహింప తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రవిశంకర్, కార్యదర్శి శ్రీనివాసులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వెంటనే 12వ పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలన్నింటిని వెంటనే చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అలానే కారుణ్య నియామకాలను వెంటనే పూర్తిచేయాలన్న డిమాండ్‌లతో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున బీటీఏ నేతలు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు.